క్లుప్తంగా

నవ ధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్

మండవల్లి: కొర్లపాడులో డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు ఆదివారం నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. రబీ పంట తీసిన తర్వాత భూమిని ఖాళీగా ఉంచకుండా ఎకరానికి 30 రకాల విత్తనాలు చల్లాలన్నారు. ఇవి పచ్చిరొట్టగా వినియోగించడం వల్ల భూసారం బాగా పెరుగుతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయం సాధించవచ్చని తెలిపారు.

వైభవంగా గంగానమ్మ జాతర



కైకలూరు: గంగానమ్మా... నీ అండదండలు గ్రామానికి కావాలమ్మా అంటూ భక్తులు గ్రామ దేవత గంగానమ్మను భక్తితో వేడుకున్నారు. సీతనపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న గంగానమ్మ, పైడిల్లమ్మ అమ్మవార్ల జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీహరి శర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. సన్నాయి మేళాలు, మంగళ వాయిద్యాలు కనక డప్పు వాయిద్యాలతో గ్రామ యువత ఉత్సాహంగా ఆడిపాడారు. పెద్ద ఎత్తున విచ్చేసిన మహిళలు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. దేవస్థానం కమిటీ సభ్యులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనులపండువగా కల్యాణోత్సవం



మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి భ్రమరాంబ, మల్లేశ్వర స్వామిల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గూడూరు వెంకట రామకృష్ణ యాజ్ఞికత్వంలో, గుడివాడ నాగతిరుమల వెంకట్రామానాయుడు, భోగయ్యనాయుడు, వెంకయ్య, నాగబాబు దంపతులతో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద, పండితుల మంత్రోచ్ఛరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అర్చకులు గూడూరు హనుమశ్శాస్త్రి, భవానీశంకర్ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు కల్యాణాన్ని పర్యవేక్షించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చేబోయిన వీర్రాజు, సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, డి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యంనకు నివాళి

చినముత్తేవి(మొవ్వ): సాయుధ పోరాట మోధురాలు, భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్ట్)లో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ స్వరాజ్యం వర్ధంతి సభను ఆదివారం మొవ్వ మండలం చినముత్తేవిలో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి ఆర్.రఘు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. చిన్న వయస్సులోనే తుపాకి పట్టి ప్రజల కోసం పోరాటాలు చేసి, అనేక సార్లు నిర్బంధించబడి, జైలు జీవితం గడిపారన్నారు. ఆమె చేసిన ప్రజా పోరాటాలను నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వై.నరసింహారావు, కళ్లం వెంకటేశ్వరరావు, కె.శివ నాగేంద్రం, ఆర్సీపీ రెడ్డి, శీలం నారాయణరావు, వాకా రామచంద్ర రావు, ఎండీ కరీముల్లా పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

కోడూరు: నిరుపేదలకు అపన్నహస్తం అందించి, సేవా కార్యక్రమాలు నిర్వహించడమే వాసవీ క్లబ్ ధ్యేయమని క్లబ్ ప్రాంతీయ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక దానా శక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా గ్రామీణ స్థాయిలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు క్లబ్‌లను పటిష్ట పర్చాలన్నారు. నాలుగు క్లబ్ నూతన సభ్యత్వాలు, ఆరుగురికి క్లబ్ పదవులను ఇచ్చారు. అనంతరం 15 మంది పేదలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను, 25 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు విద్యుత్ వెలుగులు

- నియోజకవర్గంలో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లు
- నాలుగు మండలాల్లో 9,043 నివేశన స్థలాలు
- 9,379 మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు



కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో విద్యుత్ వెలుగులు



విద్యుత్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్(ఫైల్)

కైకలూరు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుండటంతో విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ముఖ్యంగా విద్యుత్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తే బిల్లు చెల్లించే అవసరం లేదు. వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం ద్వారా పగటి పూట 9 గంటల పాలు నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది.

భారీగా రాయితీలు

కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో కలిపి మొత్తం 9,043 నివేశన స్థలాలను జగనన్న లేఅవుట్‌లలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వీరిలో 901 మంది పూర్తిస్థాయిలో ఇళ్లను నిర్మించుకున్నారు. మొత్తం మీద 293 మంది లబ్ధిదారులకు నూతన విద్యుత్ మీటర్లను విద్యుత్‌శాఖ అమర్చింది. అదే విధంగా నియోజకవర్గంలో 9,379 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు జగ్జీవన్‌రామ్ జ్యోతి పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.2 కోట్ల 86 లక్షల 2వేలు రాయితీని అందించారు. అధికంగా ముదినేపల్లి మండలంలో 3,815 మంది ఎస్సీ, ఎస్టీ విద్యుత్ సర్వీసులకు రాయితీ అందుతోంది.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	పంపిణీ స్థలాలు	విద్యుత్ మీటర్లు	ఎస్సీ, ఎస్టీ సర్వీసులు	రాయితీ (రూ.లలో)
కైకలూరు	3,575	167	1,868	2,54,88,000
కలిదిండి	2,070	0	1,496	1,80,00,000
మండవల్లి	1,141	63	2,200	2,86,02,000
ముదినేపల్లి	2,257	63	3,815	1,43,10,722
మొత్తం	9,043	293	9,379	8,64,00,722

నూతన సబ్‌స్టేషన్లు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అక్వా పరిశ్రమకు కరెంటు కోతలు ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌కు ఇక్కడి సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో అదనంగా ఏడు సబ్‌స్టేషన్ల అవసరాన్ని వివరించారు. దీనిని సీఎం ఆమోదించడంతో ఇప్పటికే ఆరుతెగళపాడు, చినతాడినాడ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన జరిగి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కొండంగి, ఇంగిలింపాకలంక, వైవాక, గోపవరంలో స్థల సేకరణ చేశారు. అదే విధంగా కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్ వద్ద దాదాపు రూ.12 కోట్లతో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాలనీల్లో అత్యవసరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి సబ్‌స్టేషన్ 33/11 కేవీ కెపాసిటీతో నిర్మిస్తుండటంతో నాణ్యమైన విద్యుత్ అందుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు



జగనన్న కాలనీ లబ్ధిదారులకు విద్యుత్ శాఖ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్నారు. నియోజకవర్గంలో 7 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన విద్యుత్ స్తంభాలను వేగంగా ఏర్పాటు చేస్తున్నాం. జగనన్న కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– బి.రామయ్య, విద్యుత్ శాఖ, ఏడీఏ, కైకలూరు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



వడాలి జెడ్పీ హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: వచ్చే నెలలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మండలంలోని జెడ్పీ హైస్కూళ్లల్లో ప్రతి ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ జిల్లా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం ఒక్కొక్క సబ్జెక్టును ఎంపిక చేసుకుని ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. మండలంలో ఈ ఆదివారం లెక్కల సబ్జెక్టుకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వడాలి జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లోనూ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక తరగతులతో మెరుగైన ఫలితాలు సాధించగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈదురు గాలులు, వర్షం బీభత్సం

పామర్రు: ద్రోణి ప్రభావంతో శనివారం రాత్రి పామర్రు మండలంలో ఉధృతమైన ఈదురుగాలులు, వర్షం బీభత్సం సృష్టించింది. మండల పరిధి అడ్డాడ గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రంపై ఉన్న రేకులు గాలులు బీభత్సానికి ఎగిరిపోయాయి. గ్రామంలోని బీసీ కాలనీలో ఓ ఇంటిపై చెట్టు పడిపోవడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. మండల కేంద్రమైన పామర్రులోని పలు రహదారులు జలమయంగా మారాయి. జమీ దగ్గుమిల్లిలోని మిల్లు డొంకలో విద్యుత్ వైర్లు తెగిపడిపోవడంతో రాత్రి నుంచి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడిపోయాయి. మినుము పంటను కాపాడుకునేందుకు రైతులు పరదాలతో మినుము కుప్పలను కప్పుకున్నారు.



అడ్డాడలో ఎగిరిపోయిన చెత్త సంపద తయారీ కేంద్రం రేకులు

ఈదురుగాలులకు తెగిపడ్డ విద్యుత్ లైన్లు..

గుడ్లవల్లేరు: అకాల వర్షాలకు బలంగా వీచిన ఈదురు గాలులకు విద్యుత్ లైన్లు ఆదివారం వేకువజామున తెగిపడ్డాయి. ఈ కారణంగా గుడ్లవల్లేరు, సింగలూరు తదితర గ్రామాల్లో రోజుల్లా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ట్రాన్స్‌కో ఏఈ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అహర్నిశలు కృషి చేశారు.

పిడుగుపాటుకు పంట నష్టం..

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో పిడుగు పడి రైతుకు పంట నష్టం వాటిల్లింది. గ్రామంలో కొణతం ఆంజనేయులు, శివకృష్ణకు చెందిన పొలంలో రెండున్నర ఎకరాల వరి కుప్పపై ఆదివారం వేకువజామున పిడుగు పడింది. దీనితో రూ.లక్షకు పైగా పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. అకాల వర్షాల్లో జరిగిన ఈ విపత్తుకు తమకు పంట నష్ట పరిహారం చేకూర్చాలని విన్నవించారు. సంఘటనా స్థలికి చేరుకుని వీఆర్వో సనకా భాస్కరరావు పంట నష్టాన్ని అంచనా వేశారు.



పామర్రులో నిలిచిన వర్షపు నీరు



గుడ్లవల్లేరులో విరిగిపడిన విద్యుత్ స్తంభం

అన్నదాతల్లో ఆందోళన

తోట్లవల్లూరు: అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్న ప్రస్తుత తరుణంలో వర్షాలు కురుస్తుండటంతో కలవరపడుతున్నారు. మండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. లంకల్లో మిర్చి పంట కోత పనులు ముమ్మరంగా సాగుతుండటం, వాటిని ఆరబెట్టడం, పసుపును ఉడికించి ఆరబెట్టే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అకాల వర్షాలతో ఆయా పంటలకు ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఆయా పంటలకు పరదాలు కప్పి కాపాడుకుంటున్నారు.



దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతు శివకృష్ణ

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గుడివాడటౌన్: బీసీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలు అన్నివేళలా అండగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం నాయకులు అన్నారు. స్థానిక బీసీ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేవదాయశాఖ ఆధ్వర్యంలో కల్యాణకట్టల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని అభినందిస్తూ సీఎం కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బీసీల సంక్షేమానికి అన్ని విధాలుగా సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. దేవదాయ పాలక వర్గంలో ట్రస్ట్ బోర్డుల్లో కూడా నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ వారికి సమాజంలో గౌరవాన్ని పెంపొందిస్తున్నారని చెప్పారు. వీరి ఆర్థిక ఎదుగుదలకు ప్రతి ఏట నాయీబ్రాహ్మణుల వృత్తిదారుల ఖాతాల్లో రూ.10 వేలు అందించడంతో పాటు వారు పనిచేస్తున్న షాపులకు 150 యూనిట్లు కరెంట్ నెలవారీ ఉచితంగా ఇస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయలేదని వారు చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు, ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వర రావు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహరావు, నాయీ బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దొండపాటి వెంకట కృష్ణారావు, కార్యదర్శి ఎం.రామచంద్రమూర్తి, కేవీవీ ప్రసాద్, టీవీ రమణకుమార్, బి.కుమార్‌రాజా, బి.రామ్మోహనరావు పాల్గొన్నారు.



గుడివాడలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా సంఘాలకు మేలు

పామర్రు(పమిడిముక్కల): వైఎస్సార్ ఆసరాతోనే డ్వాక్రా సంఘాలకు మేలు జరుగుతుందని వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ తెలిపారు. మండలంలోని హనుమంతపురంలో వైఎస్సార్ ఆసరా మూడో విడతపై గడప గడపకు వెళ్లి డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు మూడు దశల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈనెల 25న వైఎస్సార్ ఆసరా నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేస్తారని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హనుమంతపురం సర్పంచ్ కలపాల రాంబాబు, బుక్ కీపర్ మునిపల్లి అతేఖ్య, వీరంకి నాగమణి, వలంటీర్ కొడమంచిలి అనూష, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మంటాడలో..

మంటాడ సచివాలయం రెడ్డిపాలెం గ్రామంలో సాయి శక్తిసంఘ వీఓఏ బాకీ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆసరాకు అర్హత గల సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు పాల్గొని అవగాహన కల్పించారు. పమిడిముక్కల మండలంలో 1330 గ్రూపులు ఉన్నాయన్నారు. మంటాడ పంచాయతీలో సుమారు రూ.2.32 కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు. కార్యక్రమంలో మంటాడ సచివాలయ కన్వీనర్ దారపురమాదేవి, రెడ్డి స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మంటాడలో అవగాహన కల్పిస్తున్న రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రాంబాబు

వైద్య శిబిరాలకు విశేష స్పందన

గుడివాడటౌన్(నందివాడ): ప్రతి పేద వాడికి మెరుగైన వైద్యం, విద్య అందించాలనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషన్ అన్నారు. నందివాడ కో–ఆపరేటివ్ బ్యాంకు భవనంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ వైద్యవిభాగం– శ్రీ వెంకటేశ్వర ప్రాథమిక సహకార పరిమితి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన రావడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ వైద్య విభాగం కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మలిరెడ్డి రవి ప్రథమంగా ఈ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారని చెప్పారు. సాధ్యమైనన్ని గ్రామాల్లో శిబిరాలు కొనసాగిస్తూ పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మొత్తం 345 మందికి గుండె, దంత, కంటి, చర్మ ఇతర వ్యాధులకు సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో 11 మందికి గుండెకు సంబంధించిన సమస్యలు, 130 మందికి కళ్ల జోళ్లు అవసరమని, 20 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించామని వీరికి కళ్లజోళ్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు దంత సమస్యలకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.సతీష్ కుమార్, సీహెచ్ సుగుణావతి, లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ కంటి వైద్య నిపుణులు, ఎంపీపీ పెయ్యల ఆదాం, కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు రంగారెడ్డి, నాయకులు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, కె.నాగరాజు, సరెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

లయన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం..

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 175 మందికి వైద్యురాలు గవిర్నేని రజిని వైద్య పరీక్షలు చేసి, మందులను అందించామని లయన్స్ అధ్యక్షుడు శింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు.

పరీక్షల సమయంలో ఆందోళన వద్దు



పదో తరగతి విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ కిషోర్ దంపతులు

బంటుమిల్లి: విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్ అన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్ కిషోర్ దంపతులను, ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

కొండలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూ లైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి

గుడ్లవల్లేరు(వేమవరం): మండల పరిధిలోని వేమవరం గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకట రమణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీరవెంకట కృష్ణమూర్తి, దేవస్థానం ఈఓ కానూరి సురేష్‌బాబు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవాలనే చిరకాల వాంఛ నేటికి సఫలమైందన్నారు. అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాన్ని పాలకవర్గం న్యాయమూర్తికి అందజేశారు.



న్యాయమూర్తికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ పాలకవర్గం

73 మంది యువకుల రక్తదానం

కోడూరు: లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక వెంకట రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 73 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మచిలీపట్నం బ్లడ్ బ్యాంక్‌కు చెందిన వైద్యులు శ్రావణి, ఇన్‌చార్జి రవి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది యువకుల నుంచి రక్తాన్ని సేకరించారు. సర్వీసెస్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధ్యక్షుడు పూతబోయిన అయ్యప్పస్వామిని పలువురు ప్రముఖులు అభినందించారు. అత్యధిక సార్లు రక్తదానం చేసిన రక్తదాత అన్నం యోగానందం శిబిరాన్ని ప్రారంభించారు. సర్వీసెస్ సభ్యులు బాదర్ల శ్రీనివాసరావు, బండే కిషోర్, బడే నాని, చిట్టిప్రోలు ఉత్తేజ్, దామోర్ల పవన్ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని మాస్టర్స్ ఈకే బాలభాను విద్యాలయం ఆధ్వర్యంలో 39వ గురు పూజ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యాలయం ఆవరణలో లోక కల్యాణార్థం, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సుదర్శన, నారాయణ హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగద్గురు పీఠం మచిలీపట్నం ప్రధాన నిర్వాహకుడు సీహెచ్ ఎస్ఎన్ రాజు నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. స్థానిక యోగా సాధకులు, దేశం నలుమూలల నుంచి జగద్గురు పీఠం ప్రతినిధులు, హోమాది క్రతువు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ఈకే రచించిన విష్ణు సహస్ర నామ ఆంగ్ల పుస్తకాన్ని అమెరికాలోని న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ లక్ష్మీ ఎస్.రెడ్డి, సీహెచ్ఎస్ఎన్ రాజు, బీఆర్‌కే రాజు ఆవిష్కరించారు.

22 నుంచి ఉగాది సంబరాలు

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 22న 108 ఆవులతో దేశీయ గోపూజ, మధ్యాహ్నం పెయ్యేల గోవుల ప్రదర్శన, విజేతల ఎంపిక జరుగుతాయన్నారు. అనంతరం పాలపోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. 23న పాలు పితుకుట, ఎడ్లజత బండి పూటి ప్రదర్శన, మధ్యాహ్నం కోడెలు, ఆబోతుల ప్రదర్శన, సాయంత్రం విజేతల ఎంపిక, 24న ఎడ్లజత స్వారీ బండి ప్రదర్శన, పాల పోటీల విజేతల ప్రకటన, మధ్యాహ్నం గో ప్రదర్శన, విజేతల ఎంపిక, అందాల రాణి, రాజు గుర్తింపు, బహుమతి ప్రదానోత్సవం జరుగుతాయని నిర్వహణ కమిటీ పేర్కొంది.

కైకలూరు: కైకలూరు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో కైకలూరు గ్రంథాలయం వద్ద బుధవారం సాయంత్రం 5 గంటలకు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం ఉంటుందని సాహితీ మిత్రుల అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపల్లి బాలకృష్ణారావు, చింతపల్లి వెంకటనారాయణ ఆదివారం చెప్పారు. లావేటి వీర శివాజీ, బలే రామయ్య, చిట్టి పార్వతీశంలకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. అదే రోజు 'కైకలూరు పట్టణ ఆలయాలు ఓ అవలోకనం' పేరున చిట్టి పార్వతీశం సంకలనం 'గ్రంథావిష్కరణ' జరుగుతుందన్నారు. సాహితీ మిత్రులు తప్పక హాజరుకావాలని కోరారు.